

రమ్మీ టేబులు ఆటగాళ్లులేక బోసిగా ఎదురవడంతో-టేబుల్ టెన్నిస్ హాలు లోకి నడిచాడు గోపాలం.

ఛటర్జీ, శ్యాంప్రసాదులమధ్య సింగిల్స్ జరుగుతోంది. ఇద్దరు ఆ ఆటలో ఛాంపి యన్స్. వాళ్లిద్దరి నడుమ పోటీ—చూడ ముచ్చటగా ఉంటుంది. వాళ్ల ఆట తీరు చూశాక టేబుల్ టెన్నిస్ అమ్మాయిల ఆట అని తేలికగా తీసి పారెయ్యగలిగే ధైర్యం ఎవరికీ ఉండదు.

రమ్మీ టే బు లు కలకలలాడేవరకూ టేబుల్ టెన్నిస్ మ్యాచ్ చూద్దామన్న సదుద్దేశంతో కుర్చీ తీసుకుని కూర్చున్నాడు గోపాలం.

గోపాలం కూర్చున్నచోటుకి కొంచం దూరంలో మరో యిద్దరు కుర్చీలలో కూర్చున్నారు. కానీ—ముఖాలకడ్డంగా పేప ర్లుండటర వల్ల వాళ్లను విష్‌చేసే ప్రయత్నం

మూసుకున్నాడు గోపాలం. కొద్దిక్షణాలలోనే ఆటచూడటంలో సంపూర్ణంగా లీనమయ్యాడు

శ్యాంప్రసాద్ సర్వీసులు బులెట్లలాగా పరుగెడుతున్నాయి, ఛటర్జీ స్ట్రోకులు బంతిని కంటికి కనిపించనంత వేగంగా ఎగరగొడుతున్నయ్. ఎవరికీ సులభంగా పాయింట్ రావడంలేదు. స్కోరు డల్‌గా ఉన్నా ఆట అద్భుతంగా ఉంది. ఎవరి మట్టుకు వారే ఎగ్జిబిషన్‌గేమ్ ఆడుతున్నారు,

'పదిరూపాయలకోసం— పట్టపగలు హత్య!'

గోపాలం త్రుళ్ళిపడి అటువైపు చూశాడు,

అరిచింది మూర్తి. పేపరు వార్తను నలుగురికీ వినిపించజేసే ప్రయత్నం చేయబోయి— ఆశ్చర్యం ఆపుకోలేక కాబోలు బిగ్గరగా అరిచాడు అతని చేతిలోని పేపరు జారిపడిపోయింది.

'నేను నమ్మను—' మెల్లగా అన్నాడు రవి. 'ప్రాణం ఖరీదు నిశ్చయంగా పదిరూపాయలకంటె ఎక్కువే. మనిషి బ్రతుకింకా అంత చవక కాలేదు.'

'నేను అబద్ధమాడేనంటావా? నేను బ్లఫ్‌చేస్తున్నాననే అనుమానం ఉంటే — పేపరు చూడు—' పేపరందుకుని చూపించాడు మూర్తి.

ఒక్కక్షణం సందేహాస్పదంగా పేపరులోకి చూస్తూ ఉండిపోయాడు రవి.

విజయ గర్వంతో—మందహాసం చిందింపచేస్తూ— 'డబ్బు, మనిషిని పాలిస్తున్న రోజులు యివి. పాతరోజులు కావు. మనిషి ధనానికి బానిస. ఈ నిజం ఎంత త్వరగా తెలుసుకుని అంగీకరిస్తే అంత మంచిది' అన్నాడు మూర్తి.

పేపరు మడిచి అవతల విసిరేస్తూ— 'నే నంగీకరించను. ప్రపంచంలో ధనానికి చాలా విలువ ఉన్నమాట నిజమే కావచ్చు. కాని ... మానవత్వంముందు ధనం చిల్లిగవ్వకు తూగదు—' అంటూ ఖండనకు పూనుకున్నాడు రవి.

వారిద్దరు పదహారణాల పచ్చి ఆంధ్రులు. ఆవేశం వారి జన్మహక్కు. ఇద్దరు ఆంధ్రులు మాట్లాడుకోడం ప్రారంభిస్తే — కొంత సేపటికది పోట్లాటగా మారితీరుతుందని ఎవరో నొక్కి వక్కాణించినటు గానే మాటలు కాస్తా వాదంగా పరిణమించాయి.

ఎంతో కష్టపడి—వాదనలో తలదూర్చకుండా సంయమనం పాటించ సాగాడు గోపాలం. నిగ్రహం పాటించేందుకు తాను ఏదో పుస్తకంలో చదివిన ఆణిముత్యంవంటి ఆంగ్లసూక్తి మననం చేసుకున్నాడు.

'నమ్మేవాడికి ఏ నిదర్శన మూ అవసరం లేదు. నమ్మనివాడిని ఎన్ని నిదర్శనాలు చూపించీ నమ్మించ తరంకాదు' ఇదీ ఆ ఆంగ్లసూక్తి.

అదీకాక నమ్మకాలమీద ఆధారపడి ఉండే విషయాలేవీ తేలవు; వ్యక్తిగత విశ్వాసాలు ఎవరివివారివి. వాటిలో ఏది నిజం అన్న ప్రసక్తికే తావుండదు.

'మనిషి—డబ్బుయొక్క నీడ. ధనవంతుడి చేతిలో రాయి రత్నమౌతుంది మనిషికీ, మాటకీ విలువను పెంచేది డబ్బు— ఇదే యీ నాటి సమాజం. ఈ నిజానికి సడలింపులు లేనే లేవు' కుండ బద్దలు కొట్టినట్లు తీర్మానించాడు మూర్తి.

తన వాదాన్ని పటిష్ఠం చేసుకునేందుకు ప్రయత్నించడంలో రవి తాత్కాలికంగా మౌనం దాల్చినట్లుంది. అదే అదునుగా పుంజుకున్నాడు మూర్తి. 'రవీ అన్ని క్వాలిఫికేషన్లూ ఉండికూడా నువ్వింకా నిరుద్యోగిగానే ఉండిపోడానికి కారణమేమిటో నిజంగా నీకు తెలియదూ? డబ్బు! డబ్బు!! ధనమే ప్రపంచలీల...అంతే రవీ. నీ విషయమే తీసుకో...'

రవి ముఖం మ్లానమైంది.

వాదం కాస్తా ప్రమాదకరమయిన



ఏడుకొండల వాడిని మనసులో చిత్రించుకుంటేనే లక్ష్మీ కటాక్షం లభిస్తుందంటారు. రోడ్డు మీద రంగు సుద్ద ముక్కలతో, బొగ్గుతో శ్రీ వెంకటేశ్వరస్వామి బొమ్మ చిత్రించినా అది లభిస్తుంది. మదరాసు మహా నగరంలోని ఒక వీధిలో పేవ్‌మెంటు చిత్రకారుడొకడు గీచిన బొమ్మ యిది. మధ్య మధ్య తెల్లగా కనిపించేవి ధర్మాత్ములు దయతో వేసిన చిన్న, పెద్ద నాణాలు. (ఫోటో : పత్రిక చిత్రకారుడు శ్రీ సంపత్‌కుమార్)

మలుపు తిరిగి - వ్యక్తిగత విషయాలవంక మళ్ళతోంది.

'ధనవంతులలో మనుషులే లేరంటావు! ఐశ్వర్యవంతు లందరూ నీలా అమానుషు లనేనా?'

'మానవత్వమూ, ఐశ్వర్యమూ ఒక ఒరలో యిమడని రెండుకత్తులు.'

ఇక వినలేకపోయాడు గోపాలం.

అతనికి హఠాత్తుగా రాధ జ్ఞాపకం వచ్చింది. ఆమె వెనుక...

భరించలేకపోయాడు.

గ్లాసెడు మంచినీళ్ళుతాగి క్లబ్బు బయటకు వచ్చాడు.

అతని మెదడు అల్లకల్లోలంగా ఉంది.

మనిషి ధనానికి బానిసేనా?

కాదు అనుకున్నాడు గోపాలం. ముందు మనిషి. తరువాతే డబ్బు. అలా అనుకోడంలో అతనికి హాయి లభించింది.

'ప్రపంచంలోని అన్నిటికంటె మనిషికే విలువెక్కువ.' మళ్ళీ మళ్ళీ అలా అనుకునే సరికి అతనికి కొంచం ధైర్యం కలిగింది. కాని—అంతలోనే సందేహం. రాధ ఏ తరగతికి చెందిన మనిషి?

డబ్బు...మనిషి...వీటిమధ్య ఆమె ఎన్నిక ఎలా ఉంటుంది? ఆలోచిస్తూ యాంత్రికంగా అడుగులు వేయసాగాడు గోపాలం.

*   *   *

స్నేహాలూ, ప్రేమలూ-వీటి ప్రారంభం అతి విచిత్రంగా ఉంటుంది. ఏ నియమానికీ కట్టుబడకుండా యివి తల ఎత్తి విస్తరిస్తాయి. మీ ప్రేమ ఎలా ప్రారంభమైం దని ప్రశ్నిస్తే కథలో పాత్రలు సమాధానం చెప్పగలవేమో కాని - వాస్తవిక జీవితంలో వ్యక్తులు సమాధానం చెప్పలేరు. వాస్తవ జీవితంలో స్నేహాలూ ప్రేమలూ వీటి తాలూకు ప్రాథమికదశలు అస్పష్టంగానూ అతి త్వరలో మరపువచ్చేవిగానూ ఉంటాయి.

రాధ, గోపాలం—యిద్దరూ మరచిపోయారు తాము ఎలా స్నేహితులయ్యారో, ఆ స్నేహం ఎలా ప్రేమగా మారిందో.

నిజమైన స్నేహం; స్వచ్ఛమైన ప్రేమ—వీటిలో ఒక చిత్రమైన గుణం ఉంది. ఇద్దరికీ సంబంధించిన విషయాల గురించి పట్టించుకోకపోవడం.

అందుకే రాధకి గోపాల గురించి తెలిసిందల్లా అతను ఎమ్మే ఫస్ట్‌క్లాసనీ— సబ్జక్టు లిటరేచరనీ.

గోపాలానికి రాధగురించి కొంచం ఎక్కువ తెలుసు. రాధ మెడిసిన్ డిగ్రీ తీసుకుని—స్వంత ప్రాక్టీసుపెట్టేముందు అనుభవం కోసం గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టరుగా చేరింది. ఒకటిరెండు సంవత్సరాలయ్యాక ఆమె అన్ని హంగులతోనూ రాధా నర్సింగ్ హోమ్ తెరుస్తుంది.

ప్రకృతి సహజంగా—స్త్రీ పురుషులమధ్య స్నేహం మరొక చిగురువేయకుండా ఉండలేదు.

గోపాలం, రాధల విషయంలోనూ యిదే జరిగింది.

స్నేహం మెల్లమెల్లగా ప్రేమ స్వరూపం దాల్చింది.

ఇద్దరికీ భవిష్యత్తుమీద ఆశలుండటం వల్ల ప్రేమను పెళ్ళిగా మార్చేసుకుని జీవితాన్ని రసరహితం చేసేసుకుందుకు తొందరపడలేదు.

ఈక్షణంలో మాత్రం గోపాలానికి రాధ గురించి ఒక్క సందేహం ఏర్పడింది.

డబ్బుకి మనిషి బానిసా? మనిషి డబ్బుకి బానిసా?

రాధ ఉద్దేశంతో యిద్దరినడుమా ఉన్న అనుబంధపు భవిష్యత్తు నిర్ణయించబడుతుంది.

రాధ నిర్ణయం ఎలా ఉంటుందో?

గోపాలం ఆత్రుతకొద్దీ అతి త్వరగా అడుగులు వేయసాగాడు.

*   *

డాక్టరు చాలా బిజీగా ఉంది.

పేషంట్ల క్యూ హనుమంతుడితోకలా పెరుగుతూందే తప్ప తరగడం లేదు.

ఆ క్యూ – భారతదేశ జనాభాకి నిదర్శనంగా ఉంది.

దేశ పురోభివృద్ధిలాగే ఆ క్యూ కూడా అతిమెల్లిగా సాగుతోంది.

రాధకి కనపడకుండా చక్కని స్థలం ఎన్నుకుని—ఆమెను పరిశీలనగా చూస్తున్నాడు గోపాలం.

'పేరు?'

'......'

'వయస్సు?'

'........'


మొటిమలా?



కోమలమైన మీ ముఖ సౌందర్యమునకు వికారము కలుగజేయు మొటిమలను క్యూటోన్ అతి శీఘ్రముగ నివారించును. క్యూటోన్ లో 4 శక్తివంతమైన క్రిమి సంహారక మూలికా తైలములు చేరియుండుటచేత!

1. మొటిమల మీద రుద్దిన వెంటనే చర్మపు పై పొరలోని చీమును వెడలించి బాధను తగ్గించును.

2. ప్రతిదినము రుద్దుచుండిన మొటిమలు వాపు తగ్గిపోవును.

3. మొటిమల వలన ఏర్పడిన గుంటలను కూడా పూర్తిగా పోగొట్టును.

4. క్యూటోన్ చెవిలో పోటు, గజ్జి, దురదలు మొదలగు చర్మ వ్యాధులను నివారించును.

క్యూటోన్ నిరపాయకరమైన మూలికా తైలము.

క్యూటోన్ అన్ని షాపులలోను దొరకును.




తయారుచేయువారు.
శ్రీవిజయాశ్రమమ్ రేపల్లె (ఆంధ్రప్రదేశ్)

TWINKLERS

తలఎత్తకుండా చకచక వ్రాసుకుపోతోంది డాక్టరు.

ఆమె చాలా చికాకు పడుతున్నట్లు చిట్లించిన నొసలే తార్కాణం.

గోపాలానికి జాలివేసింది ఆమె మీద.

పేషంట్లు డాక్టరు సహనాన్ని పరీక్షించి వదలి పెడుతున్నట్లుంది.

ఎందరు పేషంట్లు!

ఎన్ని జబ్బులు!!

ఎంత సహనశీలికయినా అసహనం కలిగే పరిస్థితులు.

చీటీల దొంతర తరుగుతోంది.

చరచర చీటీలు వ్రాసేస్తూంది డాక్టరు.

మెరుపు తీగెల్లా కదులుతున్న ఆమె వేళ్లను చూసి ముచ్చటపడ్డాడు గోపాలం.

డాక్టరు గదిముందు—ఖరీదయిన కారాగిన మెత్తని చప్పుడు. తలఎత్తి చూసింది రాధ.

తొ్రటుపాటుపడుతూ లేచింది. మందహాసం చిందించే ప్రయత్నం చేసింది. స్టెత్ తీసి టేబుల్‌మీదపెటి క్యూని చీల్చుకుంటూ హడావిడిగా నడచింది.

అప్పటికే డాక్టర్‌ని మందలిస్తున్నట్లు మృదువుగా మధురంగా రెండుసార్లు ప్రోగింది కారు హారన్.

గోపాలం అటువైపు ప్రసరింపచేశాడు తన చూపులని.

కారులో ఒక్క ఆమెమాత్రమె ఉంది. డ్రయివర్‌లేకుండా తానే డ్రైవ్ చేసుకు వచ్చినట్లుంది.

ఆమె ఎంత మాత్రమూ పేషంట్‌లా లేదు.

దిగివచ్చిన దేవతలా ఉంది. ఆకృతి దాల్చిన ఆరోగ్యంలా ఉంది.

అందానికి—అప్సరసలా ఉంది. ఐశ్వర్యానికి కుబేరుడి కూతురిలాగో, కోడలుగానో ఉంది.

'మంజరి! మీరు స్వయంగా వచ్చారా! అసలే మీకు నీరసంకదా, యింత శ్రమపడ వచ్చునా? నో...నో...ఫోన్‌చేస్తే నేను పరుగెత్తుకురానూ?'

డాక్టర్ కంఠంలో ఆప్యాయత ... అనురాగం...లాలన...సున్నితమైన మందలింపు.

'ఊహూ!... అదికాదు డాక్టర్, ఇంటి దగ్గర ఏమీతోచక బయలుదేరానంతే. దీనిలో పెద్ద శ్రమేముంది? ఇక్కడే చెక్ చేసెయ్యండి...'

'నో ప్లీజ్...మీకు తెలియదు మంజరీ. ఇది వట్టి దరిద్రగొట్టుస్థలం. ఈ డర్టీ పేషంట్లూ...ఫినాయిలు వాసనలూ...వీటి మధ్య క్షణం నిలబడలేరు. వద్దు... నేనే యింటికివస్తాను. అరగంటలో...'

'సరే. మీయిష్టం డాక్టర్.'

మంజరి – ఐశ్వర్యవంతుల అమ్మాయో, కలవారి కోడలో అయిన ఆ అందమయిన అమ్మాయి—మళ్లీ కారులో కూర్చుంది.

డాక్టర్ కారు తలుపు మూసి — అభివందనలు తెలిపి—కారు హాస్పిటల్ ఆవరణ దాటేవరకూ నిలుచుని—అప్పుడు మళ్లీ లోపలకి నడిచింది.

గోపాలం ముఖం మ్లానమైంది.

చిరాకుగా చీటీల దొంతరను దగ్గరకు లాక్కుని కుర్చీలో కూలబడింది డాక్టర్ రాధ.

'పేరు?'

'.. ...'

వయస్సు?'

'.........'

యాంత్రికంగా ప్రశ్నలు. యాంత్రికంగానే చీటిమీద వ్రాతలు;

క్యూ అయిపోతోంది. చీటీల దొంతర తరిగిపోతోంది.

ఇక మిగిలింది ఒకే ఒక్క పేషంట్.

'పేరు?'

'కళ్లలో రోకళ్లతో పొడుస్తున్నట్లు...'

'వయస్సు?'

'బుర్రలో కర్రలుపెటి బాదుతున్నట్లు కరేల్‌మంటూ...'

కోపంగా తల ఎత్తింది డాక్టరు. 'అడిగిన దానికి సమాధానం చెప్పు. అనవసరపు వాగుడు వాగకు' కసురుకుంది.

'తలనొప్పితో చచ్చిపోతున్నాను డాక్టరమ్మా! నన్ను రక్షించు—'

ఎండిన వొరుగులా ఉందా ముసిల్ది. ఆ కంఠంలో అసహాయత.

ఆ కళ్లల్లో ఆవేదన. ఆమెనిండా బాధ...వ్యధ...

'తల పగిలిపోతూంది తల్లీ ... నన్ను రక్షించు.' ఆక్రోశించింది.

'వెళ్లి—గోడకేసి తలకొట్టుకో. అంత నొప్పీ అతిత్వరగా పోతుంది...'

అసహనంగా అరచి — చీటీ వ్రాయకుండానే వెళ్లిపోయింది డాక్టరు.

త్రుళ్లిపడ్డాడు గోపాలం.

రాధ ముఖం — మునుపటిలా అందంగా కనిపించలేదు. అతి వికృతంగా కనిపించసాగింది.

'నేను మనిషిని రాధా, నాకు డబ్బు లేదు. అందుచేత నీకు నేనక్కరలేదు. నీకు హృదయమూ, మానవత్వమూ లేవు. కనుక నువ్వు నాకక్కరలేదు.'

రాధ కంటపడకుండా — దోషిలా దాక్కుంటూ పరుగెత్తాడు గోపాలం.

రాధా, గోపాలంల ప్రేమకథ విరిగి వెయ్యి ముక్కలైంది. ●

